# దేవ్యుపనిషత్తు

– డా. కరి పురుషోత్తమాచార్యులు

**ఉపోద్ఘాతము :**

అథర్వవేదానికి చెందిన అనేక ఉపనిషత్తులలో ఈ దేవ్యుపనిషత్ కూడా ఒకటి. వైష్ణవ శైవశాక్తాలుగా పేర్కొనబడే ఉపనిషత్తులలో ఈ దేవ్యుపనిషత్తు శాక్తగణానికి చెందుతుంది. పేరునుబట్టే ఈ ఉపనిషత్తు అమ్మవారికి చెందినదిగా గుర్తించబడు తున్నది. భద్రం కర్ణేభిః అనే శాంతిమంత్రంతో మొదలయ్యే ఈ ఉపనిషత్తు రూపంలో చాలా చిన్నది. ఇందులో కేవలం ఇరవైరెండు శ్లోకాలు/మంత్రాలు మాత్రమే ఉంటాయి. రూపంలో చిన్నదే అయినా తాత్వికంగా ఇది ఎంతో ఉత్కృష్టమైనది. సమస్తదేవతలూ అమ్మవారి దగ్గరకు వెళ్ళి ఆమె ఉనికిని గురించి ఓ మహాదేవీ నీవు ఎవరవు దయచేసి నీ గురించి తెలుపుము అని ప్రార్థించగా ఆవిడ దేవతలకు తన ఉనికిని విస్తారంగా తెలుపుతుంది దేవ్యుపనిషత్తులో.

**ప్రకృతి–దేవి**

దేవతలకోరికమేరకు అమ్మవారు తనగురించి సవిస్తరంగా చెప్పనారంభిస్తుంది ఈ విధంగా. ఓ దేవతలారా. నేనెవరినని మీరునన్ను అడిగారు కదా. చెబుతాను వినండి. నేను బ్రహ్మస్వరూపిణిని. నాద్వారానే పురుషాత్మమైన ఈ ప్రకృతి అంతా ఏర్పడింది. అజ్ఞానులకు ఇది శూన్యంగానూ, జ్ఞానులకు అశూన్యంగానూ, అనగా పరిపూర్ణం గానూ గోచరమౌతుంది. నేను ఆనందస్వరూపిణిని. అలాగే ఆనంద రహితమైన దానను కూడా. అనగా చిత్తశుద్ధిని పొంది నన్ను ఉపాసించే వారిపాలిట ఆనందాన్ని కలిగి, వారికి ఆనందాన్ని కలిగించేదానను. అజ్ఞానులై, నన్ను తెలుసుకోలేక, నా వారిని కష్టపెట్టేవారి విషయంలో నేను ఆనందం లేనిదానను. అట్లే అటువంటివారికి ఆనందాన్నే పంచలేను అని భావం. సృష్టిలో ఉన్న జ్ఞానం నానుండే ప్రసరిస్తున్నది అంటే,జ్ఞానానికి నేను నిలయాన్నన్నమాట. అంతేకాక, తమోగుణం నిండిపోయిన

అజ్ఞానులకు నేనుజ్ఞానం లేనిదాన్నిగా కనపడతాను. అందరిచేతా తెలుసుకోదగిన బ్రహ్మను నేను. బ్రహ్మకంటే భిన్నమైనదానను కూడా. భూమి మొదలైన పంచతత్త్వ రూపిణిని అనగా, ప్రకృతి అంతా నిండిన ఐదు తత్త్వాలలోనూ నా ఉనికి ఉండే తీరుతుంది మరియు ప్రాణులవలే నా స్వరూపం ఈ పంచతత్త్వాలకూ అతీతమైనది. అనగా నాది ప్రాణికోటిలాగా పాంచభౌతికమైన శరీరంకాదు అని తాత్పర్యం. నేను పంచభూతాలకంటే భిన్నమైన మహాభూతాన్ని అనగా, ప్రాణులందరినీ కాచే మహాప్రాణిని, కనిపించే ఈ విశ్వాన్ని నేను. ఈ విశ్వాన్ని పాలించే దేవతలైన ఏకాదశరుద్రులు, అష్టవసువులు, ద్వాదశా దిత్యులు, మిత్రావరుణులు, ఇంద్రాగ్నులు, అశ్వినీ దేవతలూ ఇలా వీరందరి లోనూ సంచారగుణాన్ని కలిగి వీరిని పాలిస్తూ పోషిస్తూ ఉంటాను. ప్రపంచానికి వెలుతురునూ, వెన్నెలనూ ఇచ్చి నిత్యం సచేతనంగా ఉంచే సూర్యచంద్రులనూ, ముల్లోకాలనూ వ్యాపించి పాలించే బ్రహ్మ, విష్ణు, ప్రజాపతులనూ నేను ధరించి ఉంటాను. దేవతలను సంతృప్తి పరచి కోరికలను తీర్చుకునే యజమానులకు ఆయా దేవతలకై వారు చేసే యజ్ఞాలకు అవసరమైన హవిస్సులను,అందుకు కావలసిన ధనాన్ని నేనే ఆ యజమానులకు ఇస్తాను. అంతేకాక, యజమానులు హోమంలో ఆహుతి చేసిన హవిస్సులను ఆయా దేవతలకు నేనే అందించి వారినీ సంతృప్తిపరుస్తాను. నేనే విశ్వాధీశ్వరుని నా ఉపాసకులకు ధనప్రసాదినిని. యజ్ఞములు చేసి తృప్తిపరచవలసిన దేవతలలో నేను ప్రధానురాలను. ఈ విశ్వానికంతటికీ తండ్రిగా కొలవబడే పరమాత్మను సర్వాధిష్ఠానరూపుడిగా విశ్వానికి ప్రకటించేది శక్తిస్వరూపిణిని అయిన నేనే.

**దేవి–త్రిమాతృరూపిణి**

లోకంలో సంతానాన్ని ప్రసవించిన ఒకతల్లి ఆసంతానానికి స్తన్యాన్ని ఇచ్చి ప్రాణాన్ని నిలబెట్టడమే కాక, అనుక్షణమూ నీడలా నిలచి కాపాడుతూ ఉంటుంది. ఇది లోకంలో సహజంగా జరిగే ప్రక్రియ. అట్లే ముల్లోకాలూ సృష్టించబడి, తుదివరకూ వాటి జీవగతిని నిర్విరామంగా కొనసాగించాలంటే, వాటికి కూడా అనుదినమూ

చోదనశక్తినిచ్చే తల్లికావాలి. ఆ తల్లే శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి, శ్రీమహాదేవి అనబడే ముగ్గురమ్మల స్వరూపిణి అయిన మూలపుటమ్మ. ఆమే పూర్ణాహుతిలో ధగద్ధగాయమానంగా ఉవ్వెత్తున ఎగసిపడే అగ్నిహోత్రుని వర్ణంలో వెలిగిపోయే కాత్యాయనీదేవి. నిరంతరం తీవ్రమైన తపస్సుచేత దీప్తిమంతమైన స్వరూపం కలిగిన నవదుర్గాస్వరూపిణి. అజ్ఞానాంధకారం నుండి సమస్తజనులనూ తప్పించి జ్ఞానదీప్తిని అనుగ్రహించే భగవతి ఆ దేవియే.

సృష్టియందు ప్రతిప్రాణికీ భావవ్యక్తీకరణకొరకు అవసరమైన వాటిని ప్రసాదించే దేవిగా దేవతలు ఏ దేవిని కొలిచారో, పర, అపర, మధ్యమా వైఖరి అని వివిధ వైఖరులలో వర్ణించబడే వాక్కులకు నెలవు ఆ దేవియే. అన్నాన్నీ, బలాన్నీ అందించే కామధేనువుతో సమానమైన తల్లి ఆ దేవియే. కాళరాత్రి, స్కందమాత, వైష్ణవి, దక్షకన్య మొదలైన రూపాలలో వేదంలో స్తుతించబడి, సకల పాపరాశినీ నశింపజేసే దురిత నివారిణి ఆ దేవియే.

## దేవి – మహాలక్ష్మీ మహావిద్య

దేవతలు ఆ దేవిని మహాలక్ష్మిగా తలచి ప్రార్థిస్తున్నారు ఈ విధంగా మహాలక్ష్మీ స్వరూపిణియైన దేవిని మేము తెలుసుకున్నాము.మాకు ఉన్న మహిమలన్నీ ఆమె ప్రసాదించినవే. అటువంటి సర్వసిద్ధిప్రదాత్రమైన దేవిని నిత్యం ధ్యానిస్తున్నాము. ఆ దేవి మమ్ములను సర్వకార్యవిజయులనుగా ప్రేరేపించుగాక అని అంతేకాకుండా దేవిని దక్షపుత్రికగా కూడా భావిస్తూ ఆమెకు తండ్రియైన దక్షుని గూర్చి ఇలా ప్రార్థిస్తున్నారు. ఓ దక్షప్రజాపతి, ఆమె ఈ జగత్తుకు తల్లి. ఆమె తనయొక్క మంగళకరములైన అమృతత్త్వ గుణములతో దేవతలను పుట్టించింది. ఆవిడే ఆదిమూలవిద్యగా కామ–యోని–వజ్రపాణికామ కళాగుహ, వాయు, అభ్ర, మాయ మొదలగు రూపములతో, సర్వప్రదేశాలలోనూ వ్యాపిస్తూ సర్వప్రాణులకూ సుఖాలనూ అందిస్తున్నది. అని దేవతలు దక్షప్రజాపతితో ఆయన కుమార్తెయైన దేవియొక్క గుణగణాలను కీర్తిస్తున్నారు.

అటువంటి దేవియొక్క మంత్రాలలో ఒక్కొక్క బీజాక్షరానికీ ఎంతోశక్తి ఉంటుంది. ఆమెయొక్క బీజమంత్రములోని "హ్రీం" అనే అక్షరం సకల మనోరథములనూ తీర్చేంతటి మహిమగలది. ఈ దేవియే ఆత్మ,శక్తి, ఈమె విశ్వమోహిని, పాశమును, అంకుశమును, ధనుర్బాణములనూ ధరించి ధుష్టులకు భీతిగొలిపేది. ఈమెయే శ్రీమహావిద్య. ఈ విధంగా దేవియొక్క అనంతశక్తిస్వరూపాలను తెలుసుకుంటారో వారు శోకములను తరిస్తారు. ఈ దేవియొక్క స్వరూప రూప గుణగణాలను బ్రహ్మాదులు కూడా తెలుసుకోజాలరు. కనుక ఆమే అజ్ఞేయ అని పిలువబడుతున్నది.ఆ దేవికి అంతం అనేది ఉండదు. కాబట్టి ఆదేవి అనంత అనబడుతున్నది. దేవియొక్క స్వరూపము దృష్టిగోచరము కాదు.కావున ఆమె అలక్ష్య అని కీర్తించబడుతున్నది. దేవియొక్క జన్మకు సంబంధించిన రాకపోకలు ఎవరికీ తెలియవు. అనగా పుట్టుక-మరణము లేనిది. అయినా ఆమె ఉనికి లేనిదే ఈ సృష్టి లేదు. అందుచేత ఆమెను అజా అంటున్నారు శాస్త్రాలలో. ఏ దేవి సర్వత్రా ఏకాకినిగా సంచరిస్తూ అంతటా వ్యాపించి ఉంటుందో, ఆదేవిని ఏకా అని కొలుస్తున్నారు ఉపాసకులు. అట్లే సృష్టిలో ఎన్ని పదార్థములు ఉన్నాయో,వాటన్నింటి యందూ దేవి ఉన్నది. కావున ఆమె ఏకా లేక అనేకా అని తలవబడుతున్నది. ఇన్నివిధాలుగా కీర్తించబడే దేవికి సంబంధించిన ఉపనిషత్తును ప్రాతఃకాలం పఠించేవారికి రాత్రి చేసిన పాపములు, సాయంకాలంలో పఠించినవారికి పగలు చేసిన పాపములు నశిస్తాయి. రెండు సంధ్యలయందు పఠించేవారు పాపం చేయజాలరు. మధ్యాహ్నకాలంలోనూ, అర్థరాత్రియందూ జపించినవారికి అన్నమాట జరిగేంతటి వాక్శుద్ధి కలుగుతుంది. దేవియొక్క నూతన ప్రతిమముందు జపించినట్లైతే, పరిదేవతయొక్క సాన్నిధ్యమే లభిస్తుంది.

**ఉపసంహారం**

ఇంతటి మహిమగల దేవ్యుపనిషత్తు తరించాలనుకునే ఉపాసకులకు సులభంగా ఫలితాలను అనుగ్రహించేది.

స్వస్తి

# దేవీ ఉపనిషత్

## అథ దేవ్యుపనిషత్

(అథర్వవేదీయ శాక్తోపనిషత్)

శ్లో. శ్రీదేవ్యుపనిషద్విద్యావేద్యాపారసుఖాకృతి ।
త్రైపదం బ్రహ్మచైతన్యం రామచంద్రపదం భజే ॥

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।
స్థిరైరంగైస్తుష్టువాంఽసస్తనూభి వ్యశేమ దేవహితం యదాయుః ॥
స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః స్వస్తి నః పూషా విశ్వవేదాః ।
స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**అథ దేవీ ఉపనిషత్ ప్రారంభః**

**హరిః ఓం ..**
సర్వే వై దేవా దేవీముపతస్థుః। కాసి త్వం మహాదేవి।
సాబ్రవీదహం బ్రహ్మస్వరూపిణీ। మత్తః ప్రకృతిపురుషాత్మకం
జగచ్ఛూన్యం చాశూన్యం చ। అహమానందానానందాః విజ్ఞానావిజ్ఞానే అహం।
బ్రహ్మా బ్రహ్మణి వేదితవ్యే। ఇత్యాహాథర్వణి శ్రుతిః ॥ ॥ 1 ॥

అహం పంచభూతాన్యపంచభూతాని। అహమఖిలం జగత్ ।
వేదోఽహమవేదోఽహం। విద్యాహమవిద్యాహం। అజాహమనజాహం ।
అధశ్చోర్ధ్వం చ తిర్యక్చాహం ।
అహం రుద్రేభిర్వసుభిశ్చరామ్యహమాదిత్యైరుత విశ్వదేవైః ।

అహం మిత్రావరుణావుభౌ బిభర్మ్యహమింద్రాగ్నీ అహమశ్వినావుభౌ ।
అహం సోమం త్వష్టారం పూషణం భగం దధామ్యహం ।
విష్ణుమురుక్రమం బ్రహ్మాణముత ప్రజాపతిం దధామి । అహం
దధామి ద్రవిణం హవిష్మతే సుప్రావ్యే యజమానాయ సున్వతే ॥ ॥ 2 ॥

అహం రాష్ట్రీ సంగమనీ వసూనామహం సువే పితరమస్య
మూర్ధన్మమ యోనిరప్స్వంతః సముద్రే । య ఏవం వేద స
దేవీపదమాప్నోతి । తే దేవా అబ్రువన్ ।
నమో దేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః ।
నమః ప్రకృత్యై భద్రాయై నియతాః ప్రణతాః స్మ తాం ॥ ॥ 3 ॥

తామగ్నివర్ణాం తపసా జ్వలంతీం వైరోచనీం కర్మఫలేషు జుష్టాం ।
దుర్గాం దేవీం శరణమహం ప్రపద్యే సుతరాం నాశయతే తమః ॥ ॥ 4 ॥

దేవీం వాచమజనయంత దేవాస్తాం విశ్వరూపాః పశవో వదంతి।
సా నో మంద్రేశమూర్జం దుహానా ధేనుర్వాగస్మానుపసుష్టుతైతు ॥ ॥ 5 ॥

కాలరాత్రిం బ్రహ్మస్తుతాం వైష్ణవీం స్కందమాతరం ।
సరస్వతీమదితిం దక్షదుహితరం నమామః పావనాం శివాం ॥ ॥ 6 ॥

మహాలక్ష్మీశ్చ విద్మహే సర్వసిద్ధిశ్చ ధీమహి ।
తన్నో దేవీ ప్రచోదయాత్ ॥ ॥ 7 ॥

అదితిర్హ్యజనిష్ట దక్ష యా దుహితా తవ ।
తాం దేవా అన్వజాయంత భద్రా అమృతబంధవః ॥ ॥ 8 ॥

కామో యోనిః కామకలా వజ్రపాణిర్గుహా హసా।
మాతరిశ్వాభ్రమింద్రః పునర్గుహా సకలా మాయయా చ
పునః కోశా విశ్వమాతా దివి ద్యోం ॥ ॥ 9 ॥

ఏషాత్మశక్తిః । ఏషా విశ్వమోహినీ
పాశాంకుశధనుర్బాణధరా । ఏషా శ్రీమహావిద్యా ।
య ఏవం వేద స శోకం తరతి ।
నమస్తే అస్తు భగవతి భవతి మాతరస్మాన్పాతు సర్వతః ।
సైషాష్టౌ వసవః । సైషైకాదశ రుద్రాః । సైషా
ద్వాదశాదిత్యాః । సైషా విశ్వేదేవాః
సోమపా అసోమపాశ్చ । సైషా యాతుధానా అసురా రక్షాంసి
పిశాచయక్షాః సిద్ధాః ।
సైషా సత్త్వరజస్తమాంసి । సైషా ప్రజాపతీంద్రమనవః ।
సైషా గ్రహా నక్షత్రజ్యోతీంషి
కలాకాష్ఠాదికాలరూపిణీ । తామహం ప్రణౌమి నిత్యం ।
తాపాపహారిణీం దేవీం భుక్తిముక్తిప్రదాయినీం ।
అనంతాం విజయాం శుద్ధాం శరణ్యాం శివదాం శివాం ॥ ॥ 10 ॥

వియదాకారసంయుక్తం వీతిహోత్రసమన్వితం । అర్ధేందులసితం
దేవ్యా బీజం సర్వార్థసాధకం ॥ ॥ 11 ॥

ఏవమేకాక్షరం మంత్రం యతయః శుద్ధచేతసః ।
ధ్యాయంతి పరమానందమయా జ్ఞానాంబురాశయః ॥ ॥ 12 ॥

వాఙ్మయా బ్రహ్మభూతస్మాత్షష్ఠం వక్త్రసమన్వితం ।
సూర్యో వామశ్రోత్రబిందుః సంయుతాష్టకతృతీయకః ॥ ॥ 13 ॥

నారాయణేన సంయుక్తో వాయుశ్చాధరసంయుతః ।
విచ్చేనవార్ణకోఽర్ణః స్యాన్మహదానందదాయకః ॥ ॥ 14 ॥

హృత్పుండరీకమధ్యస్థాం ప్రాతఃసూర్యసమప్రభాం ।
పాశాంకుశధరాం సౌమ్యాం వరదాభయహస్తకాం ।
త్రినేత్రాం రక్తవసనాం భక్తకామదుఘాం భజే ॥ ॥ 15 ॥

నమామి త్వామహం దేవీం మహాభయవినాశినీం ।
మహాదుర్గప్రశమనీం మహాకారుణ్యరూపిణీం ॥ ॥ 16 ॥

యస్యాః స్వరూపం బ్రహ్మాదయో న జానంతి తస్మాదుచ్యతేఽజ్ఞేయా ।
యస్యా అంతో న విద్యతే తస్మాదుచ్యతేఽనంతా ।
యస్యా గ్రహణం నోపలభ్యతే తస్మాదుచ్యతేఽలక్ష్యా ।
యస్యా జననం నోపలభ్యతే తస్మాదుచ్యతేఽజా ।
ఏకైవ సర్వత్ర వర్తతే తస్మాదుచ్యత ఏకా । ఏకైవ విశ్వరూపిణీ
తస్మాదుచ్యతే నైకా ఽత ఏవోచ్యతేఽజ్ఞేయానంతాలక్ష్యాజైకా నైకేతి ।
మంత్రాణాం మాతృకా దేవీ శబ్దానాం జ్ఞానరూపిణీ ।
జ్ఞానానాం చిన్మయాతీతా శూన్యానాం శూన్యసాక్షిణీ ॥ ॥ 17 ॥

యస్యాః పరతరం నాస్తి సైషా దుర్గా ప్రకీర్తితా ।
[దుర్గాత్సంత్రాయతే యస్మాద్దేవీ దుర్గేతి కథ్యతే ॥18 ॥
ప్రపద్యే శరణం దేవీం దుందుర్గే దురితం హర ॥]

తాం దుర్గాం దుర్గమాం దేవీం దురాచారవిఘాతినీం ।
నమామి భవభీతోఽహం సంసారార్ణవతారిణీం ॥ ॥ 19 ॥

ఇదమథర్వశీర్షం యోఽధీతే పంచాథర్వశీర్షజపఫలమవాప్నోతి ।
ఇదమథర్వశీర్షం జ్ఞాత్వా యోఽర్చాం స్థాపయతి ।
శతలక్షం ప్రజప్త్వాపి సోఽర్చాసిద్ధిం చ విందతి ।
శతమష్టోత్తరం చాస్యాః పురశ్చర్యావిధిః స్మృతః ॥ ॥ 20 ॥

దశవారం పఠేద్యస్తు సద్యః పాపైః ప్రముచ్యతే ।
మహాదుర్గాణి తరతి మహాదేవ్యాః ప్రసాదతః ॥ ॥ 21 ॥

ప్రాతరధీయానో రాత్రికృతం పాపం నాశయతి ।
సాయమధీయానో దివసకృతం పాపం నాశయతి ।
తత్సాయం ప్రాతః ప్రయుంజానః పాపోఽపాపో భవతి ।
నిశీథే తురీయసంధ్యాయాం జప్త్వా వాక్సిద్ధిర్భవతి ।
నూతనప్రతిమాయాం జప్త్వా దేవతాసాంనిధ్యం భవతి ।
ప్రాణప్రతిష్ఠాయాం జప్త్వా ప్రాణానాం ప్రతిష్ఠా భవతి ।
భౌమాశ్విన్యాం మహాదేవీ సంనిధౌ జప్త్వా మహామృత్యుం తరతి।
య ఏవం వేదేత్యుపనిషత్ ॥ ॥ 22 ॥

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।
స్థిరైరంగైస్తుష్టువాంఁసస్తనూభి వ్యశేమ దేవహితం యదాయుః ।
స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః స్వస్తి నః పూషా విశ్వవేదాః ।
స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ఇతి శ్రీదేవ్యుపనిషత్సమాప్తః**